క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

దామెర : మండలంలోని ఊరుగొండ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ గుర్రం రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఊరుగొండ, పసరగొండ, పులుకుర్తి, దుర్గంపేట్, సీతారాంపూర్, గ్రామాల గృహ, వాణిజ్య, పారిశ్రామిక, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండలంలోని శనిగరం, గూనిపర్తి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్ స్టేషన్ల మెయింటెనెన్స్, చెట్టు కొమ్మలు తొలిగింపులో భాగంగా శనిగరం, గోపాల్‌పూర్, నేరెళ్ల, లక్ష్మీపూర్, గూనిపర్తి, శ్రీరాములపల్లి, అంబాల గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నాయకుడు అరికిల్ల దేవయ్య, యూత్ నాయకుడు ముక్కెర ముఖేష్ తెలిపారు. అధ్యక్షుడిగా దామెర చిరంజీవి, అధికార ప్రతినిధిగా సందీప్, ఉపాధ్యక్షులుగా బలుగూరి దేవేందర్, కొయ్యడ రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సతీష్, కార్యదర్శిగా వడ్డెపల్లి రామకృష్ణ, కోశాధికారిగా జన్ను అఖిల్, ప్రచార కార్యదర్శిగా నాగరాజు, సహాయ కార్యదర్శిగా పూర్ణచందర్‌ను ఎన్నుకున్నారు. ఎంఎస్‌పీ గ్రామ అధ్యక్షులుగా కొయ్యడ ఓంప్రకాశ్, అధికార ప్రతినిధిగా రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా అఖిల్, ప్రధాన కార్యదర్శిగా రాజు, కార్యదర్శిగా అర్జున్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మామిడి భాస్కర్, సదయ్య పాల్గొన్నారు.

కంప్యూటర్ అందజేత



వేలేరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు 1991–92 బ్యాచ్‌కు చెందిన బిల్లా శ్రీనివాస్ ఆయన తండ్రి బిల్లా సత్యనారాయణ జ్ఞాపకార్థం రూ.30 వేల విలువచేసే కంప్యూటర్ అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరిశెట్టి రాజన్నకు అందించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన వైష్ణవి(17) ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వైష్ణవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన బిల్లా శ్రీనివాస్, లోకలబోయిన మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి ఇరువురి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట రమేశ్, రామరాజు ఉన్నారు.

కుర్చీల బహూకరణ



ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామంలో షాలోమ్ ప్రార్థన మందిరానికి అదేగ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బరిగెల సదానందం–శ్రీలత దంపతులు 100 కుర్చీలు అందించారు. చర్చి ఫాదర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్, శివనగర్, ఫోర్ట్‌రోడ్డుపై జీవనం సాగిస్తున్న అనాథ వృద్ధులు, యాచకులకు స్థానిక నేత శ్రీరాం రాజేష్, కన్నోజు లావణ్యతో కలిసి సామాజికవేత్త, కాంగ్రెస్ నాయకుడు పగడాల సతీష్ శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభాగ్యులకు దాతలు చేయూతనందించాలని అన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ పడమరకోట జంక్షన్‌లో రూ.5లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ హాజరై పనులను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్జెల శ్యామ్, దామోదర్ పాల్గొన్నారు.

గాయపరుస్తున్న గేట్‌వాల్వ్

- రోడ్డుకు సమానంగా నిర్మాణం
- పైకప్పులు అమర్చడం మరిచిన కాంట్రాక్టర్
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



ధర్మారంలో ప్రమాదకరంగా మిషన్ భగీరథ గేట్‌వాల్వ్



నడికూడ మండలం గొల్లపల్లిలో..

నడికూడ : నాలుగేళ్ల క్రితం మిషన్‌భగీరథ పనుల కోసం ఏర్పాటు చేసిన గేటువాల్వ్‌లు వాహనదారులను గాయాలపాలు చేస్తున్నాయి. రోడ్డుకి సమానంగా గేటువాల్వ్‌లు నిర్మించిన సంబంధిత కాంట్రాక్టర్ పైకప్పు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నడికూడ నుంచి ధర్మారం వరకు రోడ్డుకు ఆనుకుని, గ్రామాల్లోని కొందరి ఇంటి ఎదుట మిషన్‌భగీరథ గేటువాల్వ్ హోల్స్ ఉన్నాయి. దీంతో చిన్నపిల్లలు, పశువులు అందులో పడిపోయే ప్రమాదం ఉందని, మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణంలో గుత్తేదారులు నిర్లక్ష్యం వహించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఇలాంటి సంఘటనలు జరుగుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మండల కేంద్రం నుంచి ధర్మారం వరకు రోడ్డుపక్కనే మిషన్ భగీరథ గేట్‌వాల్వ్‌లు ఉండడంతో రాత్రి వేళల్లో వాహనాలు నడుపాలంటే ఇబ్బంది పడుతున్నాం. ప్రమాదాలు జరుగుతాయని భయం వేస్తుంది. అధికారులు స్పందించి వాటికి పైకప్పులు నిర్మించాలి.

– వేముల బాబు, నడికూడ, ఆటో డ్రైవర్

అధికారులు స్పందించాలి



మిషన్ భగీరథ పైపులైన్ల పనులు పూర్తయి నాలుగేళ్లు అవుతోంది. సంబంధిత కాంట్రాక్టర్ పనులు పూర్తిచేసి పైకప్పులను ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ చేయలేదు. అధికారులు స్పందించి గేటువాల్వ్ హోల్స్‌పై కప్పులు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి.

– కోటేశ్వర్, బీజేపీ నాయకుడు, నడికూడ

బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం

- మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి



దామెర : బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర : బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి భరోసా కల్పించారు. మండల కేంద్రానికి చెందిన సొనబోయిన కొమురమ్మ, పులుకుర్తికి చెందిన గోవిందు దాసు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ధర్మారెడ్డి శుక్రవారం ఇరువురి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పోలం కృపాకర్‌రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, గోవిందు అశోక్, రమేశ్, గోపాల్, మల్లయ్య, రాజమౌళి, సంపత్, కార్యకర్తలు, బాధితుల కుటుంబ సభ్యులు ఉన్నారు.

పెరిగిన జీతాలు తక్షణమే అమలు చేయాలి

వరంగల్ చౌరస్తా: గతంలో పెరిగిన జీతాలను వరంగల్ పాత బీట్ బజార్‌లో కిరాణం అండ్ అనాజ్ దుకాణాల్లో పనిచేస్తున్న గుమాస్తాలు, కార్మికులకు తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. ఆల్‌షాప్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దుకాణ సముదాయాల్లో శుక్రవారం సర్వే నిర్వహించి వేతనాలు, ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పెరిగిన జీతాలు ఇవ్వాలని అడిగితే కార్మికులను యజమానులు అనేక ఇక్కట్లకు గురి చేస్తున్నారని విమర్శించారు.

సంక్షేమ హాస్టళ్ల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



దామెర : ఎస్టీ హాస్టల్‌లో ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న విద్యార్థులు



శాయంపేట : పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

దామెర : రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. దామెర క్రాస్ సమీపంలో గల ఎస్టీ సంక్షేమ గురుకుల హాస్టల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంపిణీచేశారు. అనంతరం విద్యార్థులకు డైట్ చార్జీలను పెంచినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ రాసిన లేఖను ఎమ్మెల్యేకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సంక్షేమ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు రమణారెడ్డి, సత్యవర్ధన్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని దామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాయంపేట : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరయ్యారు. కేక్ కట్‌చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎస్ఎస్ఆర్ అధినేత నాయినేని సంపత్‌రావు, నాయకులు రాంనర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రప్రకాశ్, పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ రవీందర్, డైరెక్టర్లు కుమారస్వామి పాల్గొన్నారు.

కమలాపూర్ : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు రవీందర్, చరణ్‌పటేల్, శ్రీకాంత్, డాక్టర్ కుమారస్వామి, రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, కనుకరత్నం, రమేశ్, కృష్ణమూర్తి, రవి, మహేందర్, శంకరయ్య పాల్గొన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని నంది సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం జరిగాయి. కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. బాణసంచా పేల్చి కేరింతలు కొట్టారు. అలాగే వృద్ధులకు, వికలాంగులకు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు వెంకటేశ్వర్‌రావు, వివిధ మండలాల అధ్యక్షులు, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ, యూత్ విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కంఠాత్మకూరులో మాజీ వైస్ ఎంపీపీ కోగంటి తిరుపతి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు.

ఎల్కతుర్తి : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఘనంగా జరిగాయి. ఆ పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు, ప్రయాణికులకు స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. నాయకులు ఇంద్రసేనారెడ్డి, రాజేశ్వర్‌రావు, సంతాజీ, శ్రీకాంత్, వెంకటేశ్, మహేందర్, మహేందర్, అనిల్‌కుమార్, అయిలయ్య, అశోక్ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పంచకూట శివాలయ పునఃప్రతిష్ఠ

- కనులపండువగా శివపార్వతుల కల్యాణం
- దర్శించుకున్న ప్రముఖులు



ప్రతిష్ఠ చేస్తున్న వేద పండితులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో పూర్తిగా రాతి కట్టడంతో నిర్మించిన పంచకూట శివాలయం పునఃప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. వేద పండితులు శివ కిరణ్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో శివలింగాలు, పార్వతీ మాత, గణపతి, కుమారస్వామి నవగ్రహాల యంత్రాలు విగ్రహాలను వేద మంత్రాల మధ్య ప్రతిష్ఠించారు. యాగశాలలో హోమం నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహాన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి.. స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామమంతటా పండుగ వాతావరణం కనిపించింది. ఆలయ కమిటీ చైర్మన్ వంగాల బుచ్చిరెడ్డి, సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. సీఐ సంతోశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: వరంగల్ పరిధిలోని ప్రతాపరుద్ర (దేశాయిపేట) ఫిల్టర్ బెడ్‌లో పైపులైన్ల నిర్వహణ పనులు కొనసాగుతున్న క్రమంలో శనివారం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని మండిబజార్, చార్‌బౌలి వాటర్ ట్యాంక్ పరిధిలోని పలు కాలనీల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మొబైల్‌కు దూరంగా ఉంచాలి

హసన్‌పర్తి: పిల్లలను మొబైల్‌కు దూరంగా ఉంచాలని ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న సూచించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో శుక్రవారం కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నేరంగా పరిగణించాలని చెప్పారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు మాట్లాడుతూ పిల్లలకు కిశోర దశ చాలా కీలకమని వివరించారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించారు.

అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న శంకర్

హన్మకొండ: వనరుల్లో వాటా, అధికారంలో భాగస్వామ్యం కలిపించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో హనుమకొండలో కులగణనను స్వాగతిద్దాం - సామాజిక న్యాయం సాధిద్దాం అనే అంశంపై శుక్రవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం తామెంతో తమకు అంత వాటా సాధన ఉద్యమానికి సామాజిక కుల గణన సామాజిక సర్వే దోహదపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సూచించారు. సదస్సులో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ సోమ రామ్మూర్తి, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అప్పటివరకు నియామకాలు నిలిపివేయాలి

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ, ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ సంఘాల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణను అమలు చేయడంలో దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలబెడతామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఎమ్మెస్పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు వేల్పుల సూరన్న, బొడ్డు దయాకర్, జన్ను దినేష్ మాదిగ, జి.సుకుమార్, ఉమామహేష్, సుంచు రజిని కుమార్, ధరిగి శ్రీనివాస్, రాజరపు క్రాంతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు వరం 'కల్యాణలక్ష్మి'

- ఎంపీ, ఎమ్మెల్యే కడియం కావ్య, శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

ధర్మసాగర్ : రాష్ట్రంలోని పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం వరంగా నిలుస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 62 మంది, కాజీపేట మండలానికి సంబంధించిన 12 మంది లబ్ధిదారులకు శుక్రవారం సాయంత్రం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని అన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. ఆర్డీఓ రమేశ్ రాథోడ్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేయాలి

- ఎంఎస్పీ నేత మంద కుమార్‌మాదిగ



మాట్లాడుతున్న మంద కుమార్‌మాదిగ

ధర్మసాగర్ : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన అనంతరమే ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ నేత బొడ్డు దయాకర్ మాదిగ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని, కానీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసి మాదిగలకు ద్రోహం చేస్తున్నట్లు ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ కేటగిరిలో 80 శాతం టీచర్ పోస్టులు మాలలకే దక్కాయని, రాష్ట్ర ప్రభుత్వం మాలల ఒత్తిడికి తలొగ్గిందని విమర్శించారు. తక్షణమే ఉద్యోగాల భర్తీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నవంబర్ 16న మంద కృష్ణమాదిగ ధర్మయుద్ధం రథయాత్ర ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకుడు సూరన్న, శాంతిసాగర్, దినేష్, సురేందర్, సుకుమార్, శ్రీనివాస్, ప్రశాంత్, రమేశ్ పాల్గొన్నారు.

గుట్కా, అంబర్ విక్రయిస్తే కేసులు



పట్టుకున్న గుట్కా, అంబర్ ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

కమలాపూర్ : మండలంలోని కిరాణషాపుల యజమానులు గుట్కా, అంబర్ విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రెండు కిరాణషాపుల్లో అక్రమంగా విక్రయిస్తున్న గుట్కా, అంబర్ ప్యాకెట్లను శుక్రవారం పట్టుకున్నారు. అంబర్, గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు వేముల వీరస్వామి, చేరాల రమేశ్ కిరాణషాపులపై దాడులు చేసి తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో రూ.7,865 విలువచేసే గుట్కా, అంబర్ ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని వేముల వీరస్వామి, చేరాల రమేశ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సై వీరభద్రరావు, హెడ్ కానిస్టేబుల్ కుమారస్వామి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



డాక్టర్ నరేష్‌తో మాట్లాడుతున్న నాయకులు

కమలాపూర్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని యూత్ కాంగ్రెస్ నాయకులు గందసిరి భిక్షపతి, పుల్ల మహేందర్ కోరారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం వారు సందర్శించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్‌తో మాట్లాడారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉండటంతో మండల ప్రజలు ఎక్స్‌రే కోసం హనుమకొండ, ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను తెలుపాలని, తాము కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌బాబుకు వివరిస్తామని తెలిపారు. తద్వారా ప్రణవ్‌బాబు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు రాజేష్, సుభాష్, దినేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు



శాయంపేట : ప్రభుత్వ నిషేధిత గుడుంబా విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించగా గుడుంబా విక్రయిస్తున్న పాలకుర్తి సారయ్య, కోగిల సమ్మమ్మ వద్ద నుంచి 12 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని ఇరువురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారిని శాయంపేట తహసీల్దార్ సత్యనారాయణ ఎదుట బైండోవర్ చేయగా వీరితో పాటు పాత కేసుల్లో ముద్దాయిగా ఉన్న గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన మాలోతు దేవుసింగ్‌ను కూడా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. గుడుంబా విక్రయిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై సులోచన, కానిస్టేబుల్స్ రవీందర్, విజయకుమార్ ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం

నడికూడ : ప్రభుత్వం పేదల కోసం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులు నిల్వచేసి వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు పరకాల ఎస్సై శివకృష్ణ తెలిపారు. మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన పరుషవేణి కుమారస్వామి, తూర్పాటి శ్రీధర్, తూర్పాటి ఐలయ్య ఇళ్లలో సోదాలు నిర్వహించగా దాదాపు 85 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు టాటాఏసీ వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ కనిపిస్తే వెంటనే పోలీస్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్స్ దయాకర్, భాస్కర్, సుధాకర్, దేవేందర్, రాజయ్య, భాస్కర్ పాల్గొన్నారు.